నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, మంగళవారం 28 మే 2024 | MAHABUBNAGAR NARAYANPET


పత్తి రైతులను పట్టిపీడిస్తున్న

## నకిలీ బెడద

ఉమ్మడి జిల్లా రైతులు అత్యధికంగా పత్తి పంటను సాగు చేస్తారు. ప్రస్తుతం ఆ పంటను సాగు చేసేందుకు రైతులు జడుసుకుంటున్నారు. ఏవి అసలో.. ఏవి నకిలీవో తెలియక సతమతమవుతున్నారు. చాలామంది రైతులకు గతేడాది నకిలీ విత్తనాలను అంటగట్టడంతో పంట పెరిగినా పత్తి రాక తీవ్రంగా నష్టపోయారు. ఈసారి కూడా అదే పరిస్థితి ఉన్నది. జిల్లాలో అధికార యంత్రాంగం టాస్క్‌ఫోర్స్‌ను పెట్టినా వ్యాపారులు నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. గద్వాల జిల్లా నకిలీ విత్తనాలకు కేరాఫ్‌గా మారింది. భూత్పూర్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేటలో కూడా నకిలీ విత్తనాలు మార్కెట్లో విచ్చలవిడిగా వచ్చేశాయి. దీంతో రైతులు పత్తి విత్తనాలను కొనాలంటేనే భయపడుతున్నారు. నాసిరకం విత్తనాలు కొని అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. భారీ పెట్టుబడి పెట్టినా పంట చేతికి రాక అప్పుల పాలై అవస్థలు పడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గోప్లాపూర్‌లో వ్యవసాయ, పోలీసు శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి నకిలీ బీటీ పత్తి విత్తనాలను భారీగా పట్టుకున్నారు. సుమారు మూడున్నర లక్షల విలువైన 3.20 క్వింటాళ్ల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేశారు. నారాయణపేట జిల్లాలో ఊట్కూర్ పోలీసులు 13.7 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేశారు. గద్వాల జిల్లా అయిజలోనూ నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో విత్తనాల కొరత, నకిలీ విత్తనాల బెడద రైతాంగాన్ని వేధిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం వానకాలం ప్రారంభానికి ముందే అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ఊట్కూర్‌లో పట్టుబడిన నకిలీ విత్తనాలు (ఫైల్)



గద్వాల పట్టణంలో రైతులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న పెస్టిసైడ్ దుకాణాలు

# విత్తనాల్లేవ్!

- జోగుళాంబ గద్వాల జిల్లాలో సీడ్స్ కొరత
- మిగతా జిల్లాల్లోనూ అదే పరిస్థితి
- కాగితాలకే పరిమితమైన వానకాలం సాగు ప్రణాళిక
- వర్షాల అదునుకు పొలాలను దున్నుతున్న అన్నదాతలు
- 'రైతు భరోసా' లేనట్లేనా?
- ఆందోళన చెందుతున్న కర్షకులు

మహబూబ్‌నగర్, మే 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా వర్షాలు పడుతుండడంతో రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. దుక్కి దున్ని జూన్ మొదటి వారంలో విత్తేందుకు సన్నద్ధమవుతున్నారు. గతేడాది యాసంగి సాగు ఆశించినంతగా లేకపోవడంతో ఈసారి వానకాలంపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. నైరుతి రుతుపవనాలు కూడా సకాలంలో వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా. వానకాలం సాగు అంచనాలకు మించి ఉండడంతో అందుకు తగ్గట్టుగా విత్తనాలను సరఫరా చేయడంలో అధికారులు చేతులెత్తేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని చోట్లా రైతులకు అవసరమైన విత్తనాలు లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. వానకాలం విత్తన ప్రణాళిక కాగితాలకే పరిమితమైంది. మరోవైపు నకిలీ పత్తి విత్తనాలు మార్కెట్లో పోటెత్తుతున్నాయి. కల్తీ విత్తనాలపై అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. దొడ్డిదారిలో వ్యాపారస్తులు రైతులకు అంటగడుతున్నారు. గతేడాది కూడా పెద్ద ఎత్తున నకిలీ పత్తి విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు రూ.లక్షల్లో నష్టపోయారు. ఇప్పటికే రెండుచోట్ల పత్తి విత్తనాలను పట్టుకున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు నకిలీ విత్తనాలపై కొరఢా ఝులిపిస్తున్నా వ్యాపారులు మాత్రం అదే దారిలో నడుస్తున్నారు. వానకాలం సమీపిస్తున్నా ప్రభుత్వం రైతు భరోసాపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడంతో ఈసారి కూడా రైతాంగం ప్రైవేట్ అప్పుల వైపు మొగ్గుచూపుతున్నది. పెట్టుబడి సాయం కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే పరిస్థితి దాపురించింది. మరోవైపు ఎరువుల కొరత వెంటాడుతున్నది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో వానకాలం సాగుకు అధికారులు ఇప్పటివరకు విత్తనాలను అందుబాటులో ఉంచకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాకు ఇప్పటివరకు 650 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు మాత్రమే వచ్చాయి. మిగతా విత్తనాలు రాలేదు. కాగా, అధికారులు మాత్రం వరి 20,887 క్వింటాళ్లు, కంది 710 క్వింటాళ్లు, మొక్కజొన్న 1,128 క్వింటాళ్లు, వేరుశనగ 4,251 క్వింటాళ్లు, ఆముదం 29 క్వింటాళ్లు, మినుములు 36 క్వింటాళ్లు, మిరప 15 క్వింటాళ్ల విత్తనాలు కావాలని అధికారులు ఇండెంట్ పెట్టా రు. ఈ జిల్లాలో ఒకవైపు కృష్ణానది మరోవైపు తుంగభద్ర ప్రవహిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అత్యధిక సాగు ఇక్కడే ఉంటుంది. కానీ రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొన్నది.

### విత్తనాలకు కటకట..

ఉమ్మడి జిల్లాలో 2024 వానకాలానికి సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు ఆయా జిల్లాల్లో విత్తన ప్రణాళికను రెడీ చేశారు. దీంట్లో రైతులకు అవసరమైన విత్తనాలతోపాటు ఎరువులు కూడా సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మార్కెట్లో మాత్రం రైతులకు సరిపడా విత్తనాలు లభించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నారాయణపేట జిల్లాలో అధికారులు 44,396 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇప్పటివరకు 35,516 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, అలాగే పత్తి 2 లక్షల ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు ఎలాంటి కొరత లేదని అధికారులు తెలిపారు. వారి అంచనా ప్రకారం 49,739 క్వింటాళ్లు ఉండగా ఇప్పటివరకు 38,450 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని అంటున్నారు. 1,98,520 ప్యాకెట్ల పత్తి విత్తనాలు రెడీగా ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 3,21,523 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఇందుకు గానూ 47,260.40 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేశారు. అంతేకాకుండా యూరియా, డీఏపీ కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ, ఎండీపీలు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ శాఖ చెబుతున్నది.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎర్రవల్లి తండాలో పొలాన్ని దున్నుతున్న రైతన్న



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

# సకాలంలో డబ్బులు చెల్లించాలి

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- పెంట్లవెల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

పెంట్లవెల్లి, మే 27 : మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో తాలు లేకుండా పరిశీలించి కాంట వేసి రైస్ మిల్లర్లకు తరలించాలని సిబ్బందికి సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఏమైనా ఇబ్బందులున్నాయా అని అక్కడున్న రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో డబ్బులు చెల్లించాలని సమాఖ్య సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు రామన్‌గౌడ్, నరసింహ, ఎర్ర శీను, భాస్కర్‌గౌడ్, కబీర్, వెంకటస్వామి తదితరులున్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖాన వద్ద బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి

# బాధితులను ఆదుకోవాలి

- అకాల వర్షాలతో మరణించిన బాధిత కుటుంబాలకు రూ.11లక్షలు..
- ఇండ్లు కూలిన వారికి రూ.5లక్షలివ్వాలి : మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి
- నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో మృతదేహాల పరిశీలన
- ఆసుపత్రి ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

నాగర్‌కర్నూల్, మే 27 : నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షానికి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. తిమ్మాజిపేట మండలం మారేపల్లి వద్ద ధ్వంసమైన కోళ్లఫారాన్ని పరిశీలించి పిడుగుపాటుతో వెంకటయ్య మృతి చెందగా ఆయన కుటుంబాన్ని, కూలిన రేకుల ఇల్లు బాధితులను పరామర్శించారు. అనంతరం తాడూరు మండలం ఇంద్రకల్‌లో నిర్మాణంలో ఉన్న కోళ్ల షెడ్డు కూలి నలుగురు మృతిచెందిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు చేరుకొని మృతదేహాలను పరిశీలించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా దవాఖాన ఎదుట విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షానికి మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.11లక్షలు, ఇండ్లు కూలిన వారికి రూ.5లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రకృతి ప్రకోపానికి పేదలు నష్టపోవడంతోపాటు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు. తెలకపల్లిలో పిడుగుపాటుకు బాలుడు మృతి చెందాడని వారి కుటుంబాలకు న్యాయం చేయాలని అధికారులతో మాట్లాడారు. గాలివానకు ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. ప్రస్తుత సీఎం ఈ జిల్లాకు చెందిన వ్యక్తే కాబట్టి ప్రత్యేక దృష్టిపెట్టి న్యాయం చేయాలన్నారు. ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకోవడం కాదని, వారికి అన్యాయం జరిగినప్పుడు ముందుండాల్సిన బాధ్యత సర్కారుదేనన్నారు. ఇంత జరిగినా ఆదుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడం బాధాకరమన్నారు. గాలివాన బీభత్సం వల్ల నియోజకవర్గంలో పదిమంది ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలను పరిశీలించేందుకు సైతం ఆదేశాలివ్వకపోవడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలు, బంధువులతో దవాఖాన కిక్కిరిసిందని.. వారి పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరారు. సోమవారం సాయంత్రానికల్లా పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ పార్టీ తరపున వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఇలాంటి ఘటనలకు స్పందించినప్పుడే ప్రజాపాలనకు విలువ ఉంటుందన్నారు. పరిహారం సైతం తూతూ మంత్రంగా కాకుండా కోళ్లఫారం షెడ్లు కూలిన బాధితులకు ఇంజినీర్లతో అంచనా వేయించి పరిహారం అందించాలన్నారు.

### బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ధర్నా

మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా దవాఖాన ఎదుట ప్రజాసంఘాలు, విపక్షాలు, ప్రతిపక్ష నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రతి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మృతిచెందిన వారి కుటుంబాల తరపున ఆయా గ్రామాల ప్రజలు, బంధువులు ధర్నాలో పాల్గొన్నారు. ప్రతి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, బీఎస్పీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జిల్లా దవాఖాన ఎదుట బాధిత కుటుంబసభ్యులతో కలిసి ధర్నా చేస్తున్న ఆయా పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

# కాంగ్రెస్‌లో ఇసుక కల్లోలం

- వంగూర్‌లో 'కొత్త, పాత' వర్గాలుగా విడిపోయిన శ్రేణులు
- సీఎం సొంత మండలంలో కరువైన సయోధ్య
- ఇతరులను పార్టీలోకి చేర్చుకోవడంతో పాత నాయకుల అసహనం
- ఇష్టమైతే ఉండండి.. లేకుంటే పార్టీని వీడండని హెచ్చరించిన ఎమ్మెల్యే!



వంగూరు మండలంలో ఇసుకను టిప్పర్‌లోకి తోడుతున్న హిటాచీ

కల్వకుర్తి, మే 27 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత మండలంలో కాంగ్రెస్ నాయకుల మధ్య ఇసుక పంచాయితీ తలెత్తింది. కొత్త, పాత వర్గాలుగా కాంగ్రెస్ శ్రేణులు విడిపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని వద్దంటున్నా పార్టీలోకి ఆహ్వానించడంపై తీవ్ర అసంతృప్తిలో ఉన్న పాత నాయకులకు ఇసుక పంచాయితీ పుండు మీద కారం చల్లినట్లయ్యింది. కాంగ్రెస్‌లో కొత్తగా చేరిన వారికి ఎమ్మెల్యే సహకరిస్తూ తమను పట్టించుకోవడం లేదని పాత నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. ఎమ్మెల్యేగా గెలిపించే వరకు ఓడ మల్లయ్యలమైన తాము ఇప్పుడు బోడ మల్లయ్యలమయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సీఎం సొంత మండలం వంగూరు..

అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూరు.. సీఎం రేవంత్‌రెడ్డి సొంత మండలం. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ మండలంపై ముఖ్యమంత్రి కుటుంబం ప్రత్యేక దృష్టి సారించింది. వంగూరుతోపాటు చారకొండ మండలాల్లో వివిధ పార్టీల్లో కొనసాగుతున్న నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. స్థానికంగా ఉన్న అదే పార్టీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా పట్టించుకోకుండా చేర్చుకోవడంతో అసమ్మతి మొదలైంది. కొత్తగా పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యత లభిస్తుండడంతో కొత్త, పాత కాంగ్రెస్ నాయకుల మధ్య స్పష్టమైన విభజన ఏర్పడింది. కష్టాలను భరిస్తూ, పార్టీ కోసం పనిచేస్తే.. అధికారం వచ్చాక తమను కూరలో కరివేపాకులా తీసేస్తున్నారని పాత నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ పరిస్థితి పొమ్మనలేక పొగ బెట్టినట్లు తయారైందని వారు వాపోతున్నారు.

### కొత్త, పాత కాంగ్రెస్‌గా స్పష్టమైన విభజన..

ఇసుక పంచాయితీ కొత్త, పాత కాంగ్రెస్ నాయకుల మధ్య స్పష్టమైన విభజనను తీసుకొచ్చింది. వంగూర్ మండల సరిహద్దుల గుండా దుందుభీ వాగు పారుతున్నది. సరిహద్దు గ్రామాల నాయకులకు ఇసుక ఆదాయ వనరు అన్న మాట కాదనలేని నిజం. అధికారంలో ఏ ప్రభుత్వం ఉంటే ఆ పార్టీ నాయకులు ఇసుక విషయంలో ఆధిపత్యం చూపుతారన్నది జగమెరిగిన సత్యం. ఇన్నాళ్లు డీలా పడిన హస్తం నేతలు రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హుషారయ్యారు. పార్టీ కోసం పనిచేసిన తాము మాత్రమే కష్టమైనా, సుఖమైనా అనుభవించాలని భావించారు. అధికారం చేపట్టగానే అప్పట్లో పార్టీని విమర్శించిన వారు హస్తం గూటికి రానివ్వొద్దని పాత కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకొచ్చారు. అయినా తమ మాట చెల్లుబాటు కాకపోవడం, కొత్తగా పార్టీలో చేరిన వారికే ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇస్తుండడంతో పాత నేతలు ఆందోళనకు గురవుతున్నారు.

### ఇసుక పంచాయితీతో బహిర్గతమైన విభేదాలు..

వంగూరు మండలం దుందుభీ సరిహద్దు గ్రామాలలో చాలామందికి ట్రాక్టర్లున్నాయి. వారు తమ వాహనాల్లో ఇసుకను సరఫరా చేస్తుంటారు. అధికార పార్టీ అండదండలున్నవారు ఇందులో ముందుండడంతో అసలు సమస్య ఇక్కడే వచ్చి పడింది. మండలంలోని మిట్టసదగోడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ వీరాభిమాని ఒకాయన తన ట్రాక్టర్‌లో ఇసుక నింపుకొని కల్వకుర్తికి వచ్చాడు. అనుమతులు లేకుండా ఇసుకను సరఫరా చేస్తున్నాడని కల్వకుర్తి పోలీసులు కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పీఎస్‌కు తరలించారు. విషయం తెలుసుకొని మిట్టసదగోడుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత(పాతకాంగ్రెస్) తన అనుచరులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్సైని ఆరా తీశాడు. కేసు నమోదు చేశామని చెప్పడంతో సదరు నేత ఇదే విషయాన్ని ఎమ్మెల్యేకు వివరించాడు. ఆరోజు జెడ్పీ సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే నేరుగా వంగూరు జెడ్పీటీసీతో కలిసి కల్వకుర్తి పీఎస్‌కు రాగా ట్రాక్టర్‌పై కేసు నమోదు చేశామని.. కోర్టులో జరిమానా కడితే ట్రాక్టర్ విడిచిపెడతామని పోలీసులు చెప్పడంతో కాంగ్రెస్ నాయకులు అసహనానికి లోనయ్యారు. కష్టనష్టాలకోర్చి పనిచేసిన తమ ట్రాక్టర్లను పోలీసులు పట్టుకోవడమేంటని ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. నిన్న, మొన్న పార్టీలో చేరిన వారు ఇసుక దందాతో లక్షలు సంపాదిస్తున్నారు.. వారి వాహనాలను ఎవరూ పట్టుకోరు.. మా ట్రాక్టర్లను మాత్రం పట్టుకుంటారా అంటూ ప్రశ్నించారు. మాటామాట పెరిగి పార్టీలో ఉంటే ఉండండి లేకుంటే వెళ్లిపోండని ఎమ్మెల్యే అనడంతో గొడవ మరింత ముదిరింది. దీంతో పోలీసులు కలుగజేసుకోగా ఎమ్మెల్యే కోపంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొత్తగా పార్టీలో చేరిన వారు ఇసుక దందా చేస్తే ఏమనరు.. తమలాంటి గ్రామస్థాయి నాయకులు ట్రాక్టర్లలో ఇసుక సరఫరా చేస్తే పట్టుకుంటారా? పార్టీకి ఇన్నాళ్లు సేవ చేసిన తాము బతకొద్దా? అని అరుస్తూ పీఎస్‌నుంచి బయటకొచ్చారు. ప్రతి గ్రామంలో ఇదే పరిస్థితి ఉందని.. మళ్లీ ఎన్నికలు రావా? అప్పుడు ఏం చేయాలో అది చేసి చూపిస్తామంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.



బంకులో తనిఖీలు చేస్తున్న అధికారులు

# అంతా ఓకే!

- పాలమూరు పెట్రోల్ బంకుల్లో దాడులు
- అక్రమాలు లేవని తేల్చిన అధికారులు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 27 : మహబూబ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంకులపై అందుతున్న ఫిర్యాదుల మేరకు జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి ఎలాంటి అవకతవకలు లేవని అధికారులు తేల్చారు. బంకుల్లో అంతా సక్రమంగా ఉందని సర్టిఫికెట్లు ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పాలమూరులోని పలు పెట్రోల్ బంకుల్లో కిరోసిన్‌ను కలిపి అమ్ముతున్నారని వినియోగదారులు ఫిర్యాదులు చేశారు. అయితే అధికారుల తనిఖీల్లో ఇవేమీ బయట పడకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. జిల్లా కేంద్రంలోని కైలాష్ ఆటో సప్లైస్, హైటెక్, రామేశ్వర, ఆర్ఎస్ రాఠీ ఫిల్లింగ్ స్టేషన్లపై తనిఖీలు నిర్వహించి ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని తేల్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్రోల్ బంకు నిర్వాహకులు ప్రతి రోజూ పెట్రోల్/డీజిల్ డెలివరీ ద్వారా నిర్ధారించుకున్న తర్వాతే పంపులను వాడాలన్నారు. పంపులకు ఏడాదికోసారి విధిగా వెరిఫికేషన్ సర్టిఫికెట్ తీసుకోవాలని, కాల పరిమితి ముగిసిన తర్వాత కూడా వాటిని వాడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు కోరితే ఐదు లీటర్ల క్యాన్‌తో డెలివరీలను చెక్ చేసి చూపించాలని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి సూచించారు. పై నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు సమస్యలు ఎదురైతే లీగల్ మెట్రాలజీ కార్యాలయాన్ని సంప్రదించాలని, వాట్సాప్ ద్వారా 9010651783 నెంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చన్నారు.

# పరారీలో ఇద్దరు నిందితులు?

- లభించని ప్రభుత్వ మున్సిపల్ ఉద్యోగి ఆచూకీ!
- కాంగ్రెస్ నేత ఆదేశాలతో పోలీసుల అలసత్వం
- వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజాసంఘాల డిమాండ్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మే 27 : మహబూబ్‌నగర్‌లోని బండమీదిపల్లి వద్ద ఉన్న వైన్స్‌షాపులో బీరు కొనుగోలు విషయంలో తలెత్తిన వివాదంలో శ్రీకాంత్‌యాదవ్‌ను హత్య చేసిన వారిలో ఇద్దరు పరారీలో ఉన్నారా? లేక కావాలనే పోలీసులు అరెస్ట్ చేయడం లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిదిమందిని అరెస్టు చేసిన పోలీసులు మిగతా ఇద్దరిని అరెస్టు చేయకపోవడం వెనుక రాజకీయ కుట్ర ఉన్నదన్న చర్చ నడుస్తున్నది. అధికార పార్టీకి చెందిన నేత ఆదేశాలతోనే పోలీసులు ఆ ఇద్దరినీ అరెస్టు చేయడం లేదన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. పరారీలో ఉన్న ఇద్దరిలో ఒకరు మున్సిపల్ ఉద్యోగి ఉన్నట్లు సమాచారం. ఈ కేసుల్లో ఏ10గా ఉన్న వ్యక్తికి రాజకీయ అండదండ ఉండడంతోనే అరెస్ట్ చేయడం లేదన్న చర్చ జోరుగా సాగుతున్నది.

### ఇద్దరు నిందితులను అరెస్టు చేయాలి

ఈ హత్య కేసును మొదట్లో పోలీసులు తాత్సారం చేశారు. ప్రజాసంఘాలు, మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదులు, ఆందోళనలు, ధర్నాలు, 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందించి పోలీసులు కేసు నమోదు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో మద్యం మాఫియా దాడి చేయడంపై పలు విమర్శలొచ్చాయి. వైన్స్‌షాపు వారిని రక్షించేందుకు ఓ నాయకుడు ప్రయత్నించారన్న ఆరోపణలూ ఉన్నాయి. పరారీలో ఉన్న వారిని అరెస్టు చేయడంలో పోలీసుల అలసత్వం కారణంగా వారు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని.. ఆ ఇద్దరినీ అరెస్ట్ చేయాలని యాదవసంఘం నాయకుడు శ్రీనివాస్, చందుయాదవ్, ముదిరాజ్ యువజన నాయకుడు రాకేశ్‌తోపాటు పలువురు కోరుతున్నారు.


WANTED TEACHERS

Required Teachers to teach in Geetham High School, Jadcherla

1. Pre Primary : 5 Posts
2. Primary : English, EVS & Maths
3. High School : Telugu & English, Social

Contact

9705028666, 7013492217, 7780592004

Interview date : 28th, 29th MAY, 2024

Time : 10 AM to 5 PM

Geetham HIGH SCHOOL (Reg. by Govt. of Telangana) (E/M NURSERY - X CLASS) MAHABUBNAGAR - JADCHERLA